# జాబ్‌మేళాను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్

**అనంతపురం, సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్)** : జిల్లాలో జాబ్ మేళా ను షెడ్యూల్ ప్రకారం నిర్వహించేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కోర్టు రోడ్డు లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయమును జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయం లోని సిబ్బంది వివరాలను, వారు చేసే పనులను, వారుచేసే కార్యక్రమాలను పరిశీలించారు. అప్రెంటిషిప్ యాక్ట్ ఇంప్లిమెంటేషన్ జరగాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ అధికారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సమన్వయంతో అప్రెంటిషిప్ యాక్ట్ ద్వారా ప్రైవేట్ కంపెనీల వారితో సంప్రదించి యువతకి అవకాశం కల్పించే విధంగా జాబ్ మేళాలను ఏర్పాటుచేసి ఉద్యోగ అవకాశం కల్పిం చాలన్నారు. సంకల్ప పథకం కింద వచ్చే నిధులను సరైన పద్ధతిలో వినియోగించుటకు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జాబ్ మేళాను షెడ్యూల్ ప్రకారం నిర్వహించే విధంగా చూడాలన్నారు. పదో తరగతి తర్వాత ఇలాంటి కోర్సులు చేయాలని పి పి టి ని తయారు చేయాలని యంగ్ ప్రాసెసర్ ను ఆదేశిం చారు. ప్రతి స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్,ఎస్టీ, ఎస్సీ, బిసి, హాస్టల్స్ నందు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఉపాధి శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళాలు, విద్యార్థులలో కోర్సులపై అవగాహన కల్పించే విధంగా జిల్లా ఉపాధి కల్పన అధికారి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి,ఎన్ ఎ సి అసిస్టెంట్ డైరెక్టర్ వారు సమ న్వయం చేసుకొని జిల్లాలో విద్యార్థినీ విద్యార్థులకు, యువతకు ఉపాధి మరియు ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉద్యోగ అవకాశం కల్పించే విధంగా చూడా లని, రాష్ట్రంలో అనంతపురం జిల్లా నందు ఎక్కువ అవకాశం కల్పించే విధంగా చూడాలన్నారు.ఈ కార్య క్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి,ఎన్ ఎ సి అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి రాజ్ కుమార్, అనంతపురం రూరల్ తహసీల్దార్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు వైకుంఠవాసుని సేవలు

**అనంతపురం కల్చరల్, సెప్టెంబర్ 13, (ప్రభన్యూస్)** : అనంతపురం నగరంలోని సాయి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నేడు కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ఒక్కరోజు సేవలు నిర్వహించనున్నారు. గుత్తి రోడ్డులోని శ్రీ సెవెన్ కన్వెన్షన్ హాల్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పూజ కార్యక్రమం లో భాగంగా సెప్టెంబర్ 14వ తేది ఏకాదశి ఉదయం 5గం.లకు సుప్రభాత సేవతో మొదలవుతుందని, అనంతరం సూర్యప్రభ వాహనసేవ, స్నపన తిరుమంజనం, సహస్ర కలశాభిషేకం, హనుమద్ వాహన సేవ, అష్టదళ పద్మపాదసేవ, తోమాల సేవ, పుష్పయాగం, తిరుప్పావడ సేవ,7 శనివారాల వ్రతం, గరుడువాహన సేవ, సహస్ర దీపాలంకరణ సేవ, ఎదుర్కొల్లు ఉత్సవం, కల్యాణోత్సవం, చంద్ర ప్రభ వాహన సేవ, పవళింపు సేవ తో కార్యక్రమం ముగుస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో సేవ కర్తలుగా పాల్గొనే అవకాశం ఉంటుందని ఆసక్తి కలిగిన వారు డా.విజయసాయి కుమార్ ప్రెసిడెంట్ సాయి ట్రస్ట్ -8712345520 ను సంప్రదించగలరని ఆయన తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే అనంతకు అభినందనలు



మాజీ ఎమ్మెల్యే అనంతకు అభినందనలు తెలుపుతున్న వైసీపీ నాయకులు

**అనంతపురం కార్పొరేషన్ సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్)** : జిల్లా వైసీపీ అధ్యక్షులుగా అనంత వెంకటరామిరెడ్డిని నియామకమైనందుకు. శుక్రవారం నగరంలోని కోర్టు రోడ్డులోని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డినీ. వైసీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి పూలబుకే ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

## డ్రైనేజీ శుభ్రతపై ఎమ్మెల్యే ఆగ్రహం

**అనంతపురం సెప్టెంబర్ 13 (ప్రభ న్యూస్)** : నగరంలో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంపై అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది నా వరకు ఫిర్యాదులు చేస్తున్నారంటే శానిటేషన్ సిబ్బంది ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నగరంలో 21వ డివిజన్ అంబేద్కర్ నగర్ లో కాలువలు నిండి, మురుగునీరు బయటకి రావడం పై స్థానికులు ఎమ్మెల్యే దగ్గుపాటి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన వెంటనే స్పందించారు. నగరపాలక సంస్థ శానిటేషన్ సిబ్బందికి ఫోన్ ద్వారా మాట్లాడి ఎందుకు పరిస్థితి ఇలా ఉందని ఆరా తీశారు. వెంటనే సిబ్బందిని పంపి శుభ్రం చేయించాలని ఆదేశించారు. వెంటనే శానిటేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని కాలువలను శుభ్రం చేశారు. సీజనల్ వ్యాధులు ఉన్న నేపథ్యంలో పరిసరాలన్నీ శుభ్రంగా ఉండాలని ఆయన సూచించారు. ఇలా డ్రైనేజీలు రోడ్లపై పొంగిపొర్లడం వలన జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఎమ్మెల్యే అన్నారు. నగరపాలక సంస్థ సిబ్బంది నిత్యం దీనిపై పర్యవేక్షణ ఉండాలని దగ్గుపాటి ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఫిర్యాదులు రాకూడదని ఆయన అన్నారు.

## పదవీవిరమణ హోంగార్డుకు ఆర్థిక సాయం

**అనంతపురం క్రైమ్, సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్)** : అనంతపురం జిల్లా తాడిపత్రిలో హోంగార్డుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన డి.వెంకటసుబ్బమ్మకు జిల్లా ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం రూ. 4,39,200 చెక్కును అందజేశారు. జిల్లా హోంగార్డుల ఒక రోజు వేతనంలో ఈ మొత్తాన్ని ఇచ్చారు. పదవీ విరమణ పొందిన మహిళకు ఆర్థిక సాయం అందించేందుకు దోహదపడిన జిల్లా హోంగార్డులను ఎస్పీ అభినందించారు. అదనపు ఎస్పీ డి.వి.రమణమూర్తి, ఆర్ ఐ మధులు ఉన్నారు.



చెక్కును అందజేస్తున్న ఎస్పీ జగదీష్

## వరద బాధితులకు ఆర్థికసాయం



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

**అనంతపురం అర్బన్ సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్)** : విజయవాడలో వరదలతో అల్లాడుతున్న బాధితులకు తనవంతు సాయంగా అనంతపురం ఉమ్మడి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు వడ్డే సిమెంట్ పోలన్న 2 లక్షల 16 రూపాయలను అందించారు. సత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు జెరిపిటి కృష్ణమూర్తితో కలిసి ఆయన శుక్రవారం విజయవాడలో స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు చెక్ అందజేశారు. వరద బాధితుల కోసం 2 లక్షల 16 రూపాయలను అందజేసిన టీడీపీ నాయకులు, వడ్డెర సంఘం నేత సిమెంట్ పోలన్నను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. కష్టాల్లో ఉన్న విజయవాడ వాసులకు అండగా తనవంతు సాయంగా వడ్డే సిమెంట్ పోలన్న నగదు అందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అనంతరం జెరిపిటి కృష్ణమూర్తి, వడ్డే సిమెంట్ పోలన్న మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి (పుట్టపర్తి) జిల్లా ప్రజల తరపున ఈ సహాయం అందజేశామన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలోనే విజయవాడ వరద బాధితుల కోసం తమవంతు సహకారం అందించామన్నారు. వరద బాధితుల కోసం మరింత మంది మానవతావాదులు ముందుకొచ్చి వరద బాధితుల కోసం సాయం అందించాలని వారు కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు వడ్డే పుల్లన్న తదితరులు ఉన్నారు.

## వైద్యవిద్య ప్రైవేటీకరణ సరికాదు




ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు

**అనంతపురం వైద్యం, సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్)**: వైద్యవిద్య ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నించడం సరికాదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ అన్నారు. సోమవారం స్థానిక రాష్ట్ర వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్, జిల్లా అధ్యక్షులు సిద్ధూ, నగర అధ్యక్షులు భీమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్యా వ్యాపారీకరణకు శ్రీకారం చుట్టిందన్నారు. వైద్య విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని రాష్ట్రవ్యాప్తంగా 12 ఎంబిబిఎస్ కళాశాలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎమ్మెల్యే రాష్ట్రంలో వైద్య శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మూసివేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నీట్ కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను తల్లిదండ్రులను కలుపుకొని పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పరమేష్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు సోము, శశి కుమార్, వినోద్ కుమార్, చంద్ర, శివ, గణేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## రగ్గుల పంపిణీలో నేతలు

**అనంతపురం, సెప్టెంబర్ 13 (ప్రభన్యూస్ ప్రతినిధి)** : రాష్ట్రాన్ని ముంచెత్తిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు ఆదేశాల మేరకు సుజనా చౌదరి ఎమ్మెల్యేగా ఉన్నటువంటి విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 42 వ డివిజన్ ప్రాంతాలైన భవానిపురం, ఓల్డ్ హెచ్ బీ కాలనీ, పాత పోలీస్ స్టేషన్, లలిత నగర్, ప్రియదర్శిని కాలనీ, వెల్లంపల్లి కాలనీ ల్లో వరద బాధితులను ఆదుకునేందుకు ఇంచార్జ్ బాధ్యతలు చేపట్టిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నాటి నుంచి నేటి వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన ఆయన బృందం నేడు మూడో రోజు ముంపు ప్రాంతాల్లో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.అందులో భాగంగా 42 వ డివిజన్లోని జమ్మిచెట్టు వీధిలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. స్థానిక డివిజన్ పార్టీ అధ్యక్షులు ముదిరాజ్ శివాజీ సహాయ సహకారాలతో స్థానికంగా దాదాపు 1500 దుప్పట్లు పంపిణీ చేశామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, క్లస్టర్ ఇంచార్జ్ గోపాల్ గౌడ్ లు తెలియజేశారు. ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితి నెలకొందని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైన త్వరితగతన చక్కదిద్దుతారని ప్రజల ఆశాభావంతో ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ ముఖ్యమంత్రిగా వుండి ఉంటే పరిస్థితి ఏ విధంగా ఉండేదో ఊహించుకుంటేనే కష్టం అన్నారు. విజయవాడ ప్రజల దాహార్తిని తీర్చే ప్రకాశం బ్యారేజ్ ని కూల్చేసి లక్షలాదిమంది ప్రాణాలకు ముప్పు వాటిల్లే విధంగా ప్రయత్నం చేసిన జగన్ అనుచరుల భరతం పట్టాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ గోపాల్ గౌడ్, ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి చిర్రోళ్ల రామాంజనేయులు, యూనిట్ ఇంచార్జ్ వడ్డే మురళి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న నేతలు


**శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్**

నమోదిత కార్యాలయం : 501, సల్కాన్ అరుం, జసోలా జిల్లా సెంటర్, కొత్తఢిల్లీ - 110025

సిఐఎన్ : యు65900డిఎల్2020పిఎల్సి366027

**వేలం ప్రకటన**

శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ యొక్క దిగువ తెల్పిన రుణగ్రహీతలకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వారి నుండి వారిచే పొందిన బంగారంపై రుణం/లు బ్యాంకు వారిచే జారీచేయబడిన వ్యక్తిగత నోటీసులతో సహా వివిధ డిమాండ్లు మరియు నోటీసులు ఇచ్చినప్పటికి వారిచే సర్దుబాటు చేయబడలేదు రుణగ్రహీతలందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారితో సెక్యూరిటీగా ఉంచిన బంగారు ఆభరణాలు వేలం వేయుటకు నిర్ణయించబడినది మరియు రుణాలు పొందిన శాఖ ఆవరణలలో తదనుగుణంగా 25.09.2024న మ॥03.00గం॥లకు వేలం తేదీగా నిర్ణయించబడినది. రుణగ్రహీతలతో సహా అందరు ఖాతాదారులు మరియు యావన్మంది ప్రజలు వేలం యొక్క నియమనిబంధనల ప్రకారం ఈ వేలంలో పాల్గొనగలరు.

| శాఖ | ఖాతా నెం. | ఖాతాదారుని పేరు | తండ్రి/ భర్త లేదా భార్య పేరు | చిరునామా | ఖాతా తెరచిన తేది | చెల్లించవలసిన మొత్తం |
|---|---|---|---|---|---|---|
| జూబ్లీహిల్స్ | 103942511419 | మాదాల ఆర్ కుమార్ | తండ్రి మాదాల | 2/142, రాయలచెరువు యాడికి అనంతపూర్, ఆంధ్రప్రదేశ్-515408 | 08/05/2024 | 202211.57 |
| జూబ్లీహిల్స్ | 103942511424 | జి శ్వేత | తండ్రి జి లేపాక్షి | 32-476, తారకరామపురం, ధర్మవరం, అనంతపూర్, ఆంధ్రప్రదేశ్-515671 | 08/05/2024 | 122959.42 |

**వేలం తేది : 25.09.2024న మ॥03.00గం॥లకు**

ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం నుండి ఏదేని ఖాతాను తొలగించుట లేదా రద్దు చేయుటకు బ్యాంకు వారు హక్కు కలిగి ఉన్నారు.

సం/- అధీకృత అధికారి, శివాలిక్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్